## అటకెక్కిన ఆధార్ నమోదు కేంద్రం దీనికి బాధ్యులు ఎవరు?

విశాలాంధ్ర-మోతుగూడెం : మోతుగూడెం పంచాయతీ పరిసర గ్రామాల ప్రజలు ఆధార్ నమోదు ప్రక్రియ గాని మార్పులు చేర్పులు చేసుకొనుటకు చింతూరు, కూనవరం, ఎటపాక, మండలాలను ఆశ్రయించవలసి వచ్చినప్పుడు సామాన్య పేద ప్రజలకు అందని ద్రాక్ష లా ఉండేది ఈ సమస్యను పలుమార్లు పై అధికారుల దృష్టి కి తీసుకువెళ్ళగా మోతుగూడెం పంచాయతీ ఆఫీస్ నందు ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగినది. ఇప్పుడు గత ఆరు నెలలుగా మోతుగూడెం పంచాయతీ ఆఫీస్ నందు ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం మూతపడి ఉందని మోతుగూడెం పరిసర గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. దీనిని కారణం యెవరు? సంబంధిత పంచాయతీ అధికారుల లేక ప్రజా ప్రతినిధులా అని ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల మరియు జిల్లా స్థాయి అధికారులను కోతున్నారు.

## సీపీఐ నేత మంగరాజు సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-ఎటపాక : సీపీఐ నేత కామ్రేడ్ కందుకూరి మంగరాజు సేవలు మరువలేనివని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో సిపిఐ నాయకులు, మాజీ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,స్వర్గీయ అమరజీవి కామ్రేడ్ కందుకూరి మంగరాజు వర్ధంతి సందర్భంగా అయన స్థూపానికి నివాళ్ళు అర్పించి మాట్లాడారు. ముందుగా ఆయన స్థూపం వద్ద సీపీఐ సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ జెండా ఆవిష్కరణ చేశారు. కుటుంబ సభ్యులు ఆయన కుమారుడు కందుకూరి సుధీర్ చంద్ర, సీపీఐ బృందం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడినా నేతని, పోలవరం నిర్వాశితుల సమస్య లపై తను చివరి వరకు పోరాడినా వ్యక్తి మంగరాజు అని, అయన మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. నిత్యం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి వారికి న్యాయం జరిగే వరకు ప్రజల కోసం నిలబడి వారి పక్షాన పోరాడేవారని, అంతే కాకుండా నిర్వాసిత సమస్యలు, పై ధర్నాలు చేపట్టి వారికి న్యాయం జరిగేలా పోరాడేవారన్నారు. అటువంటి నాయకులు మన మధ్యలేకపోవడం దురదృకరమని మండలా సీపీఐ నాయకులు అన్నారు. సిపిఐ పార్టీకి అయన తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమం లో డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము, ఎంపీటీసీ కంటే రాజు, మండల కార్యదర్శి ఎలీషాల, నాగరాజు, వల్లభ నేని సత్యనారాయణ, వరదా బ్రహ్మం, కందుకూరి సూర్య నారాయణ, ముసునూరి వెంకన్న బాబు, ఏడిద సుబ్బారావు, పూస రాఘవులు, గద్దం వెంకటేశ్వర్లు, వెంకట రత్నం, సవలం శ్రీకాంత్,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో అటల్ బిహారీ వాజ్‌పేయ్ అజాత శత్రువు

**బిజెపి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు అరిమెల రాజు**

విశాలాంధ్ర-కొయ్యూరు : భారత రాజకీయాల్లో మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్పేయి అజాత శత్రువు అని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు అన్నారు. గురువారం మండలంలో రత్న పేట గ్రామంలో వాజ్పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అరిమెల రాజు మాట్లాడుతూ మాజీ ప్రధాని వాజ్పేయి భారత రాజకీయాల్లో అజాతశత్రువు గొప్ప రాజకీయ నేత విలువలు కలిగిన వ్యక్తిగా సున్నిత మనస్కుడైన కవిగా ముద్ర చెరప వేయలేని దన్నారు. 1924 డిసెంబర్ 25న మధ్యప్రదేశ్ గ్వాలియర్లో జన్మించిన వాజ్పేయి దేశ ప్రధానిగా మూడు పర్యాయాలు సేవలందించారని తెలిపారు ఆయన జన్మదిన్నాని పురస్కరించుకొని భారత ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ప్రతి యాట సుపరిపాలన దినోత్సవం నిర్వహిస్తుందని తెలిపారు అటల్ బిహారీ వాజ్పేయి కేవలం ఒక పార్టీకి పరిమితమైన నాయకుడు కాదని ఆయన పార్లమెంట్లో ప్రసంగిస్తుంటే ప్రత్యర్థులు కూడా మంత్రముగ్ధులై వినేవారని తెలియజేశారు సర్వ శిక్ష అభియాన్ తో అందరూ చదవాలి అందరూ ఎదగాలి అనే నినాదంతో ప్రాథమిక విద్యను ప్రతి బిడ్డకు చేరువు చేసిన వ్యక్తి అటల్ బీహార్ వాజ్పేయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు కొయ్యూరు సొసైటీ డైరెక్టర్ రీ మల చంద్రరావు కార్యకర్తలు రామారావు దేముడు సంతోష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి వారపు సంతలో కాఫీని జిసిసి అధికారులు కొనుగోలు చేయాలి

**సిపిఐ మండల కార్యదర్శి సింహాచలం**

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : ప్రతి వారపు సంతలో గిరిజనులు పండించిన కాఫీని జిసిసి అధికారులు కొనుగోలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కె. సింహాచలం డిమాండ్ చేశారు. మండలంలోని సాగర పంచాయితీ బలియగూడ గ్రామంలో ఆయన సందర్శించి కాఫీ రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించిన కాఫీని సరైన గిట్టుబాటు ధరతో జిసిసి అధికారులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది పాటు ఎండనక వాననక చేయకుండా కష్టపడి పండించిన కాఫీని రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కాఫీ రైతులకు తెలియక కొంతమంది దళారులకు అన్ని మోసబోతున్నారని చెప్పారు. వారపు సంతలతో పాటు ప్రతి గ్రామంలో జిసిసి అధికారులు తిరిగి కొనుగోలు చేసి కాపీ రైతులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాఫీ కొనుగోలు దళారులు చేయకుండా చర్యలు అధికారులుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సోమేశ్వరరావు

**పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన సోమేశ్వరరావు**

విశాలాంధ్ర-చింతపల్లి : తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా గోసరెడ్డి సోమేశ్వరరావు (సోమేష్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనను టీడీపీ అరకు పార్లమెంట్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గా నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గుర్తించి పార్టీ నియమించిన పదవికి అందరి సహకారంతో న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో టీడీపీ అధిష్టానం అప్పగించిన బాధ్యత ను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. తనను ఈ పదవిలో నియమించేందుకు కృషి చేసిన పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి కి రుణపడి ఉంటానని, పాడేరు నియోజక వర్గంలో పార్టీ బలోపేతానికి, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీలు బలపరచిన అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పాడేరులో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన చెప్పారు.

## పెద్దపాలం గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంస్కృతి దీక్ష యజ్ఞం

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండలం, సోలభం పంచాయతీ పెద్దపాలం గ్రామంలో డిసెంబర్ 25, 2025 (గురువారం) విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంస్కృతి దీక్ష యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరు గ్రామాలకు చెందిన 13 కుటుంబాల నుండి 62 మంది స్వధర్మంలోకి తిరిగి ప్రవేశించారు. స్వధర్మంలోకి వచ్చిన వారికి వస్త్రదానంగా చీరలు, వస్త్రాలు అందజేశారు. ఈ యజ్ఞాన్ని విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మప్రసార ప్రముఖులు రీమలి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామస్తులు సంపూర్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రామకృష్ణ పరమహంస, ప్రధాన కార్యదర్శి కించే సత్యనారాయణ, జిల్లా బజరంగ్ దళ్ నాయకులు కుడుముల వెంకటరమణ, లక్ష్మయ్య, మండల కమిటీ సభ్యులు, గౌరవ అధ్యక్షులు జర గంగాధర్‌రావు, అర్చకులు పాల్గొన్నారు. సుమారు 150 మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరుకాగా, వారికి అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు లక్ష్మణ్ రావు, మల్లేశ్వరావు, పోతురాజు మరియు అర్చకులు చిన్న బాలయ్య, గంగరాజు సహకారంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ఎయిడెడ్ స్కూల్ మరమ్మతులకు కంబాల రూ.50,000 సాయం

విశాలాంధ్ర-దేవీపట్నం : దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట లో గల ఎయిడెడ్ స్కూల్ మరమ్మతులకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు రూ. 50,000 ఆర్థిక సహాయం చేశారు . ఎయిడెడ్ స్కూల్లో 20 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. స్కూల్ పైకప్పు రూఫ్ పాడైపోయి విద్యార్థులు చదువుకోడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పాఠశాల టీచర్ కడిమి రాంబాబు కంబాల శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చి, మరమ్మత్తుకు సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలోకి తీసుకుని, విద్యార్థుల సౌకర్యార్థం తన వంతు సహాయంగా పాఠశాల మరమ్మతులకు రూ. 50,000 రూపాయలు సహాయాన్ని గోకవరం సీఎండీ కార్యాలయం వద్ద పాఠశాల టీచర్‌కి అందజేశారు. ఈ విషయం పై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ కంబాల శ్రీనివాస రావు కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-జి.మాడుగుల : క్రిస్మస్ పండగను పురస్కరించుకుని క్రిస్ట్ సెంట్రల్ చర్చ్, రచపల్లి ఆధ్వర్యంలో బుధవారం జి.మాడుగుల మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గసాడి రెడ్డిబాబు, శుభమని దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసుక్రీస్తు జన్మదినాన్ని స్మరిస్తూ శాంతి, ప్రేమ, క్షమాగుణం, మానవత్వం వంటి విలువలపై ప్రార్థనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో క్రిస్మస్ సందేశాన్ని ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యేసుక్రీస్తు బోధనలు, క్రిస్మస్ పండగ ఆవశ్యకతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. క్రిస్మస్ అనేది కేవలం పండగ మాత్రమే కాకుండా, సమాజంలో ప్రేమ, ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించే పర్వదినమని నాయకులు పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం చర్చ్ ప్రాంగణంలో భక్తులకు భోజనాల ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ప్రభాకర్, జాన్ మాస్టర్ తదితరులు పాల్గొని సందేశాలు ఇచ్చారు. క్రిస్మస్ పండగ ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

## కొత్తపల్లి జలపాతంలో పర్యాటకులు సందడి

విశాలాంధ్ర-జి.మాడుగుల: క్రిస్మస్ పండుగ సందర్భంగా కొత్తపల్లి జలపాతానికి పర్యటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పండుగ సెలవులను ఆస్వాదించేందుకు కుటుంబాలతో పాటు యువత జలపాతం వద్ద సందడి చేశారు. జలపాతం పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. సహజ సౌందర్యాన్ని తిలకిస్తూ, ఫోటోలు తీసుకుంటూ పర్యాటకులు ఆనందంగా గడిపారు. పండుగ వాతావరణంతో కొత్తపల్లి జలపాతం ఉత్సాహంగా మారింది.

## 52 మంది పిల్లలకు రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర-పాడేరు : పాడేరు మండలం గుడివాడ వీధిలో ఉన్నటువంటి అనాథ సరణలయంలో ఉన్న 52మంది నిరాశ్రిత పిల్లలకు రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహన కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ గురువారం రగ్గులు, పెన్నులు, పెన్సిల్లు, బిస్కెట్లు, బిల్లలు పంపిణీ చేశారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువగా ఉందని దీన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలకు చలి తీవ్రత నుండి కాపాడే దిశగా రగ్గులు పంపిణీ చేయడం జరిగిందని, దీనితోపాటు పైన తెలిపిన వస్తువులు పిల్లలకు అందించడం జరిగిందన్నారు. అనాథ శరణాలయంలో ఉంటున్న పిల్లలకు దాతలు సహాయం చేయాలని ఆయన కోరారు. అన్ని విధాలుగా సహాయసహకారాలు చేస్తానని, ఎటువంటి ఇబ్బంది పడొద్దు అని, ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ లు తామర మూర్తిబాబు, కొంతెలి వెంకట ప్రసాద్,వి రమేష్, చంటిబాబు, బైరగి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## చేపల దొంగకు గో...దారి

**అర్థరాత్రుళ్ళు వేట... తెల్లవారుజామున తరలింపు**

విశాలాంధ్ర-దేవీపట్నం : పోలవరం పుణ్యమా అంటూ గోదావరి నదీ మత్స్య సంపదపై ఆధార పడి జీవించే చిన్నా చిదక బడుగు జీవులను కాదని అక్రమార్కులకు నిలయం గా మారింది. పోశమ్మ గండి పెద్ద అండతో గోదావరి మత్స్య సంపద హారతి కర్పూరంగా మారుతోంది. దుర్గారావు అనే వ్యక్తి పడవలపై వీరవరం లంక వద్ద గోదావరిలో చేపలు వేటాడి రాత్రిళ్ళు పోశమ్మ గండి మీదుగా పురుషోతపట్నం చేరి అక్కడ నుంచి ధవలేశ్వరం వ్యాన్‌పై తరలిస్తున్నారు. గోదావరిలో చేపల వేటగాళ్లు రెచ్చిపోతున్నా... అధికారులు కిక్కురుమనకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంలో లక్షల రూపాయిలు 'గండి' పెద్ద చేతులమీదుగా పంపకాలు సాగిస్తున్నట్లు బహిరంగ ప్రచారం. గోదావరి మత్స్య సంపదపై ఆధారపడ్డ గిరిజనులను కాదని దళారులు గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం నడవడం పట్ల సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. గతం లో తుని దగ్గర నుంచి వచ్చి కొందరు గోదాట్లో యదేచ్చగా చేపల వేట ఆడటంపై నియోజక స్థాయి నేతల పాత్ర ఉందనే అపవాదు ప్రజల్లో వినిపించింది తర్వాత కొందరు హడావుడీ చేసి వెళ్లగొట్టడంతో మూట ముళ్ళు సర్దుకుని వెళ్లిపోయారు. ఇదే అదునుగా స్థానిక పోశమ్మ గండిలో ఉంటున్న కొందరు చేతులు కలిపి మత్స్య సంపదను రాత్రులు రాత్రులు తరలించేస్తున్నట్లు సమాచారం. గుట్టుచప్పుడు నడుపుతున్న ఈ వ్యవహారంపై ఇప్పుడు బాహాటంగా విమర్శలు విన్పిస్తున్నాయి. గోదార్లో వేటాడుకొనేందుకు స్థానిక గిరిజనులకు అన్ని హక్కులు ఉన్నా మత్స్య శాఖ అండదండలు ఉన్నా దళారుల చేతిలో ఎప్పుడు దగా పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా అడ్డుకట్ట వేయాలని గిరిజనులు కోరుతున్నారు.

## అరకు పార్లమెంటు కమిటీలో జ్ఞానేశ్వరి, సోమేష్‌లకు చోటు హర్షణీయం

**కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు**

విశాలాంధ్ర-చింతపల్లి : టిడిపి అరకు పార్లమెంటు ఉపాధ్యక్షురాలిగా చల్లంగి జ్ఞానేశ్వరి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా గోసరెడ్డి సోమేశ్వరరావు (సోమేష్) లను అధిష్టానం నియమించడం హర్షనీయమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, మండల ప్రధాన కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు లక్ష్మణరావు, వెంగళయ్య ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి జ్ఞానేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి విధేయతగా సేవలందించి గుర్తింపు పొందినందుకు గాను జ్ఞానేశ్వరి సేవలను పార్టీ గుర్తించిందన్నారు. ఆమెకు పార్టీలో సముచిత స్థానం దక్కిందన్నారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వరి మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి తన తండ్రి లక్ష్మణరావు ట్రెజరీ ఉద్యోగిగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. ఈ క్రమంలోనే సొంత నిధులతో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నిలువెత్తు విగ్రహాన్ని మండల కేంద్రంలోని పాత బస్టాండ్ కూడాలిలో ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తలంపుతో ఉపాధ్యాయ వృత్తిని వీడి పార్టీలో చేరిన తాను విశాఖ జిల్లా కార్యదర్శిగాను, రాష్ట్ర కమిటీ లో ఎస్టీ సెల్ ఉపాధ్యక్షురాలు గాను, అరకు పార్లమెంటు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గాను, అరకు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి గాను సేవలందించడంతో పాటు, 2004 సార్వత్రిక ఎన్నికలలో పాడేరు నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయడం జరిగిందన్నారు. నాటి పరిస్థితుల దృష్ట్యా ఓటమి చెందినప్పటికీ పార్టీ పై ఉన్న అభిమానం కారణంగా పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ, ప్రతిపక్ష నేతగా ఉన్న టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై అధికార వైసీపీ కేసులు బనాయించిన సమయంలోను ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న అధిష్టానం తనపై అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షురాలుగా నియమించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరిలకు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోరాబు గాంధీ పడాల్, షేక్ ఖాసిం వల్లి, ముత్యం సత్యనారాయణ, అరడ వీరబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం

**వందేళ్ల ఆర్ఎస్ఎస్ ప్రయాణంలో విజయ గాధలెన్నో**

**అఖిలభారత సహ ధర్మ జాగరణ ప్రముఖ ఏలె శ్యాం ప్రసాద్**

విశాలాంధ్ర-చింతపల్లి : వందేళ్ళ ఆర్ఎస్ఎస్ ప్రయాణంలో విజయ గాధలు ఎన్నో ఉన్నాయని అఖిల భారత సహ ధర్మ జాగరణ ప్రముఖ ఆదరణీయ శ్యాం ప్రసాద్ అన్నారు. గురువారం చింతపల్లిలోని గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళన నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన అంతర్ల శివాలయానికి చెందిన పూజ శ్రీ శివానంద మాతాజీ, కృష్ణాపురం ఆశ్రమానికి సంబంధించి పూజ్యశ్ రామానంద యతి స్వామీజీలు, స్థానిక భక్తులతో కలిసి ముందుగా ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భారతీయ విద్యా కేంద్రం విద్యార్థినీ, విద్యార్థులు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు, భక్తులు ప్రదర్శించిన కోలాటాలు, భజనలు, దింసా నృత్యాలు ఆహుతులను ఆకర్షించాయి. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో హిందూ సమాజాన్ని (భక్తులను) ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏర్పడి ఈ ఏడాదితో వందేళ్లు పూర్తి అయిందన్నారు. 1925లోనే హిందూ సమాజ పటిష్టత కొరకు ఈ సంఘం ఏర్పడిందన్నారు. హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి, సమైక్యపరచి దేశాన్ని విశ్వ గురువుగా నిర్మాణం చేయాలనే సత్సంకల్పంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 1925లో ప్రారంభించబడి నేటికీ వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా హిందూ సమ్మేళనాలు నిర్వహించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో హిందూ సమాజం మరింత బలపడాలని ఈ సందరరేగా వారు ఆకాంక్షించారు. ఇటువంటి కార్యక్రమాలలో హిందువులంతా బంధుమిత్రులతో సకుటుంబ సపరివార సమేతంగా పాల్గొని సమ్మేళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందరరేగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు విచ్చేసి సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో వందలాదిగా తరలివచ్చిన భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## లోక రక్షకుడు ఏసుప్రభు : పాస్టర్ సుదర్శన్

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : లోక రక్షకుడు ఏసుప్రభు అని బేతేలు సంఘం పాస్టర్ సుదర్శన్ అన్నారు. మండలంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రధా నంగా బేతేలు సంఘంలో క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించు కుంటూ క్రీస్తు పాటలతో వినిపించారు. ఈ సందర్భంగా నాటికలతో పాటు నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం పాస్టర్ సుదర్శన్ మాట్లాడుతూ ఏసుప్రభు జన్మదిన చిరస్మరణీయమని చెప్పారు. త్యాగానికి ప్రతిక ఏసుక్రీస్తు అన్నారు. సాటి మనుసులో పట్ల క్రీస్తు చూపిన ప్రేమ కరుణ అనుసరణీయమన్నారు. క్షమా గుణానికి ఆయన ఓ నిలువెత్తు నిదర్శనం అని చెప్పారు. ఏసుక్రీస్తు అందరికీ ప్రభువు అని ఆయన సమస్త మానవాళికి ప్రేమ చూపిస్తూ ప్రేమ మయుడుగా అందర్నీ కరుణిస్తూ కరుణమయుడుగా 2000 సంవత్సరాల క్రితం ప్రజల కోసం వారి పాపాల్ని పరిహరించేందుకు తను సిలువలో ప్రాణాలు అర్పించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘ పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏసుక్రీస్తు జన్మదినం అందరికీ పర్వదినం

**కందుల గాదిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు**

విశాలాంధ్ర-చింతపల్లి : ఏసుక్రీస్తు జన్మదినం అందరికీ పర్వదినం అని వైసీపీ నాయకుడు దురియా హేమంత్ కుమార్ అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని కందుల గాది గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆ గ్రామంలోని యెహెూవా ప్రార్థనా మందిరానికి వెళ్లిన ఆయనను ఆ మందిరం పాస్టర్ శోభన్ బాబు గ్రామస్తులతో కలసి ఆయనను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఆయన సంఘస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏసుక్రీస్తు అందరికీ ప్రభువు అన్నారు. ప్రజల కోసం ఆయన పడిన కష్టాలు అన్ని ఇన్ని కావన్నారు. ప్రజల కోసం సిలువ వేయించుకున్న ఏకైక ప్రభువు యేసుక్రీస్తు అన్నారు. అటువంటి ప్రభువైన యేసు క్రీస్తు జన్మదినం ప్రజలందరికీ పర్వదినం అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డ్ సభ్యుడు చిట్టిబాబు, పడాల సత్తిబాబు, ముత్తా శ్రీనివాస రావు, అధిక సంఖ్యలో సంఘస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూత్ ఆధ్వర్యంలో 28నుండి మెగా క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర-వై.రామవరం : యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుండి స్థానిక పోలిస్టేషన్ ఎదుట మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు గొర్లె నరేష్ తెలిపారు.ఏజెన్సీ 11 మండలాల నుండి ఆసక్తి గల యువత తమ టీమ్ లను నమోదు చేసుకోవాలని కోరారు. క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేవారు 6303700793 (నరేష్), 6304648837 (జగదీష్) నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

## అన్నవరం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సాయిరాంను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-చింతపల్లి : మీ సేవలు మన్య ప్రాంత అభివృద్ధికి ఎంతో అవసరమని తమ్మంగుల సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య, కుడుము సారి పంచాయతీ వార్డు సభ్యుడు బోండా సింహాచలం అన్నారు.మండలం లోని అన్నవరం పోలీస్ స్టేషన్ లో నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా నియమితులైన కె సాయిరామ్ ను గురువారం వైసిపి నాయకులతో కలిసి వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ తొలి పోస్టింగ్‌లోనే అన్నవరం పోలీస్ స్టేషన్‌లో నియమితులు కావడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంతాభివృద్ధికి మీ సేవలు ఎంతో అవసరమని అన్నారు. అనంతరం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సాయిరాం మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా విధులు నిర్వర్తిస్తానని, ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, నేరాలు గంజాయి మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేస్తానని ఈ సందరరేగా ఆయన చెప్పారు.

## వీబీ జీ రామ్ జీ నూతన పథకంపై నేడు గ్రామసభలు

విశాలాంధ్ర-వై.రామవరం : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కు బదులుగా కేంద్రప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న వీబీ జీ రామ్‌జీ నూతన చట్టం పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేడు మండలంలో అన్ని సచివాలయాల పరిధుల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని పంచాయితీ అభివృద్ధి అధికారులకు ఎంపీడీవో బాపన్న దొర సూచించారు.ఉదయం 10 గంటలకు గ్రామసభలు నిర్వహించి ప్రజా ప్రతినిధులు, ఉపాధిహామీ వేతన దారులు, గ్రామపెద్దలకు నూతన పథకం పై అవగాహన కల్పించాలని కోరారు.అలాగే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులతో సమన్వయమై గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో సూచించారు.

## వాహనాలు తనిఖీ

**విశాలాంధ్ర-వి.ఆర్.పురం :** అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని రేఖపల్లి ఊరి చివరలో గురువారం ఎస్సై సంతోష్ కుమార్ పాపికొండల పర్యాటక వాహనాలను, తదితర వాహనాలను విస్తృతంగా గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ప్రభుత్వ సూచనల మేరకు పరిమితమించకుండా ప్రయాణికులను వాహనంలో ఎక్కించుకోవాలని, అనంతరం వారి కరపత్రాలను తనిఖీ నిర్వహించి, వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడపవద్దని, నియమ నిబంధనలను పాటించాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహన దారులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**విశాలాంధ్ర-చింతపల్లి :** మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని అంతర్ల గ్రామంలో గల నిస్సి క్రైస్తవ ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి, పాస్టర్ జాన్ బాబు (బి వీరబాబు), ఝాన్సీ దంపతులు క్రిస్మస్ సందర్భంగా దైవజనులు, సంఘస్తులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అదే క్రమంలో నిరుపేదలకు వస్త్రాలు వితరణగా అందించారు. అనంతరం పాస్టర్ జాన్ బాబు (వీరబాబు), ఝాన్సీ దంపతులను సంఘస్తులు దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దైవజనులు, సంఘస్తులు, కుటుంబ సభ్యులు, పాత్రికేయులు, మిత్రులు, అధిక సంఖ్యలో శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

**జీకే వీధి :** మండలంలోని వంచుల పంచాయతీ అడగారపల్లి గ్రామంలో క్రిస్మస్ పండగను వేడుకల ఘనంగా పాస్టర్ అరడ చిన్నబ్బాయి ఆధ్వర్యంలో ఆరాధన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సువార్తికులు కూడా మధుకుమార్ ప్రజలను ఉద్దేశించి క్రిస్మస్ యొక్క విశిష్టతను ప్రజలకు తెలియపరిచారు.క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించుట అని అర్థము లోకరక్షకుడైన క్రీస్తు పాపములచేత నశించిన మానవులను తన సిలువ బలియాగము ద్వారా రక్షించడానికై ఈ లోకములో జన్మించిన తరువాత జ్ఞానులు వచ్చి ఆయనను పూజించిన సంఘటనలోనుంచి ఈ క్రిస్మస్ పుట్టింది.క్రీస్తే లోకరక్షకుడని విశ్వసించి ఆయనను పూజించడం,ఆయనిచ్చే రక్షణ గురించి ఇతరులకు ప్రకటించడం క్రిస్మస్ పుట్టుక వెనుక ముఖ్య ఉద్దేశమైయుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘపెద్దలు లోత గంగరాజు, సింహాచలం, బూడిద వెంకటరావు, మండలం కృష్ణ, సంఘస్తులు గ్రామపెద్దలు అతిథులతో ఆనందంగా పాల్గొన్నారు.

**ఎటపాక :** ఎటపాక మండలం వినాయక పురం గౌరీదేవిపేట, నెల్లిపాక,

మెడువాయి, గన్నవరం, కృష్ణవరం, నల్లకుంట, నందిగామ, కన్నాయిగుడెం, కాపుగొంపల్లి గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసు ప్రభువును కొలుస్తూ భక్తులు ఆలాపించిన దైవభక్తి గీతాలు, కీర్తనలు అలరించాయి. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టతను వివరించారు. వినాయక పురం క్రీస్తు మందిరం చర్చి పాస్టర్ రెవ.పాల్రాజ్ ఆధ్వర్యంలో క్రీస్తూ బోదనలు చేపట్టారు. గౌరీదేవీపేట ఏసుక్రీస్తు సీయోను మినిస్ట్రీస్ పాస్టర్ నవీన్ లాజరస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ఆట పాటలతో అలరించారు.

**వి.ఆర్.పురం :** అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలో గ్రామ గ్రామాన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ వేడుకల్లో ఎంపీపీ కారం లక్ష్మి సిపిఎం బృందం పలు ప్రార్థనా మందిరాలలో పాల్గొన్నారు. సంతపాకల వద్ద ఉన్న ప్రార్థన మందిరంలో  పాస్టర్ డేవిడ్ లిమిస్టాన్ వి ఆర్ పురం బీసీ కాలనీ త్రియేక  పాస్టర్ యేసు రత్నం మాట్లాడుతూ  శాంతి సందేశాన్ని మోసుకొచ్చిన ఏసుక్రీస్తు పుట్టిన రోజు అని క్రిస్మస్ వేడుకలను మండలం వ్యాప్తంగా  ఉత్సాహంగా జరుపుకున్నారని చర్చలన్నీ విద్యుత్ దీపాలంకరణలతో సుందరంగా అలంకరించారన్నారు . ఈ సందర్భంగా మండల ఎంపీపీ సిపిఎం. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు జిల్లా కమిటీ సభ్యులకు సోయం చిన్నబాబు మండల కార్యదర్శి పులి, సంతోష్ కుమార్ మండల కార్యదర్శి వర్గ సభ్యులు పంకు. సత్తిబాబు సిపిఎం బృందం. వి ఆర్ పురం లోని సంతపాకల వద్ద ప్రార్థన మందిరంలో త్రియేక ప్రార్థన మందిరంలో మందిరంలో రేఖపల్లి రాజుపేట కాలనీ రామవరం పెద్దమట్టపల్లి చింతరేగుపల్లి సోములు గూడెం, తదితర గ్రామాలలో  క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన  పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు  పాల్గొని తదుపరి క్రిస్మస్ కేకు కట్ చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ  శాంతి దూత ప్రభు క్రీస్తు జన్మించిన సుదినం ఎంతో గొప్పదన్నారు. ఏసు క్రీస్తు జీవితం అందరకీ ఆదర్శప్రాయం అన్నారు.  క్రీస్తు జన్మదిన వేడుకలు ఇక్కడ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని, రాష్ట్రప్రజలు ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ సందర్భంగా మండలంలో నీ ప్రార్థన మందిరాలలో జరిగిన వేడుకల్లో వారు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వచ్చిన సంఘస్థులకు గ్రామ ప్రజలకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో  సిపిఎం  మండల నాయకులు కమ్మ చిచ్చు. సత్యనారాయణ,  సిహెచ్ సుబ్బారావు సీనియర్ నాయకులు వీర్ల నాగేశ్వరరావు, కార్యకర్తలు చర్చి సంఘ పెద్దలు తదితరులు  అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**చింతపల్లి :** అంతర్ల గ్రామంలోని హెలోహిమ్ ఎలరోయి మందిరంలో

ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక దైవజనులు గిద్యోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రిస్మస్ యొక్క విశిష్టతను వివరిస్తూ ప్రత్యేక సందేశం అందించారు. వేడుకల్లో భాగంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి, ఆనందోత్సాహాల మధ్య క్రీస్తును కొనియాడుతూ క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. మధ్యాహ్నం స్థానిక సంఘ సభ్యుల కోసం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరులు, సంఘ సభ్యులు, బంధువులు, స్నేహితులు, అధిక సంఖ్యలో శ్రేయోభిలాషులు పాల్గొని వేడుకలను సంతోషకరమైన వాతావరణంలో జరుపుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రిస్మస్ సందేశం అందజేస్తూ, యేసు ప్రభువు ప్రేమ, ఆదరణ, సేవాభావం మరింతగా విస్తరించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రిస్మస్ వేడుక చర్చి పెద్దలు, సంఘ నాయకులు, మహిళలు, యువత, చిన్నారులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు, క్రిస్మస్ సందేశాలతో వేడుకలను ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం చివరలో శాంతి, సౌభ్రాతృత్వం, సమాజ హితాన్ని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

విశాలాంధ్ర
పేజి నెం. 10
పార్వతీపురం మన్యం
శుక్రవారం 26, డిసెంబరు 2025

## భద్రగిరి 50 పడకల ఆసుపత్రి పనుల పరిశీలించిన ప్రభుత్వ విప్

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రం భద్రగిరిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను గురువారం నాడు ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆసుపత్రి ప్రారంభంతో స్థానిక ప్రజలకు వైద్య సదుపాయాలు మరింత అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గారి వెంట మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, తదితరులు ఉన్నారు.

## రన్నింగ్‌లో పెంకి గోవింద్‌కు స్వర్ణ పతకం

**రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక**

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగోడవ గ్రామానికి చెందిన పింకీ గోవిందు అనే విద్యార్థి విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగిన ఇంటర్మీడియట్ పాలిటెక్నికల్ రీజనల్ మీట్ జిల్లా స్థాయి పరుగు పందాల్లో స్వర్ణ పతకం సాధించాడు. విజేతకు బహుమతి ప్రధాన కార్యక్రమం విజయనగరంలోని ఎంవిజిఆర్ కళాశాల మైదానంలో బుధవారం జరగగా, కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చేతులమీదుగా బంగారు పతకాన్ని అందజేశారు. అంతేకాకుండా వచ్చేనెల 23వ తేదీన తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు గోవిందు ఎంపికయ్యాడు. 4ఐ400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో స్వర్ణ పతకాన్ని, అలాగే 800 మీటర్ల విభాగంలో కాంస్య పథకాన్ని గోవిందు దక్కించుకున్నాడు. గోవిందు స్థానిక ఎమ్మార్ నగరం పాలిటెక్నికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తోటి స్నేహితుడు విజేతగా నిలవడం, రాష్ట్ర స్థాయికి జరిగే పరుగు పందాలకు ఎంపిక కావడంతో సహచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## కలెక్టర్‌కు అభినందనలు తెలిపిన ఎస్పీ మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర- పార్వతీపురం : జిల్లాలో పిల్లలవ్యక్తిగత పరిశుభ్రతకొరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి ప్రవేశపెట్టిన ముస్తాబుకార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు ప్రశంసలు తెలియ జేయడంతో పాటు రాష్ట్రస్థాయిలో అమలుకు శ్రీకారం చుట్టిన సందర్భంగా జిల్లాకు మంచి గుర్తింపు తెచ్చిన జిల్లా కలెక్టర్ డా. ఎస్.ప్రభాకర రెడ్డిని దుస్సాలువతో సత్కరించి, జిల్లా ఎస్పీ

ఎస్.వి.మాధవ్ రెడ్డి అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు మెమొంటో అందజేశారు. మారుమూల గిరిజన ప్రాంతమైన మన్యం కలెక్టర్ చేసిన ఒక చిన్నఆలోచన సంచలనం సృష్టించిందని, ముఖ్యంగా విద్యార్థి దశలోనే పరిశుభ్రంపట్ల అవగాహన కల్పించిన ఘనత కలెక్టరురుదేనని కితాబు నిచ్చారు.గతంలో వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడంవలన అనారోగ్యానికి గురైన పిల్లలు, నేడు పరిశుభ్రత వలన అందరూ ఆరోగ్యంగా ఉన్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 1.24 లక్షల మంది విద్యార్థులకు గాను శతశాతం హాజరుకావడానికి ముస్తాబు కార్యక్రమమే అని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన పీఎంపీ, ఆర్ఎంపీ నాయకులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ పీఎంపీ ఆర్ఎంపీ జాయింట్ ఏక్షన్ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ ఆధ్వర్యంలో అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో గ్రామీణ వైద్యుల గుర్తింపు వినతిపత్రం అందజేశారు. పీఎంపీ అసోసియేషన్ ద్వారా ఏర్పాటు చేసిన అవయవదానం అవగాహన పోస్టర్ ను,కరపత్రాలు ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సమస్య తమ దృష్టిలో ఉందని త్వరలో తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ జేఏసీ చైర్మెన్ కేజీ గోవిందరెడ్డి,న్యాయ సలహాదారు డాక్టర్ ఎన్ఎల్ రావు,రాజకీయ సలహాదారు లంకదాసరి ప్రసాదరావు, రాష్ట్ర నాయకులు టి రాజా సిద్ధార్థ,వీబీటీ రాజు,జీఎస్ ప్రసాద్, కంబాల బాబూరావు,యామర్తి నాగేశ్వరరావు, కరెళ్ళ గణపతిఎమ్ ఎన్ రాజు, ఉమాశంకర్,సీఎస్ కుమార్, బళ్ళా శ్రీనివాసరావు, ఎన్ సుగుణేశ్వరి,వి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వావిలాల బాపూజీ స్మారక వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర- గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం గౌరడ గ్రామంలో గురువారం నాడు వావిలాల బాపూజీ స్మారక వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, ప్రభుత్వ విప్ & కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా "ఈ ఎరువులు మాకొద్దు", "కర్మణ్యేవాధికారస్తే" అనే పుస్తకాలను ఆవిష్కరించడంతో పాటు నాబార్డ్ ఆధ్వర్యంలో రూపొందించిన జీవ పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విజ్ఞానం, సాంకేతికత రైతులకు అందుబాటులోకి రావడం ఎంతో అవసరమని, ఇలాంటి విజ్ఞాన కేంద్రాలు రైతుల అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ సహజ వ్యవసాయం, రసాయన రహిత పంటల సాగుపై రైతుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి గారు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంకాడ రామకృష్ణ , గ్రంథాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎం ఆర్ నగరంలో గోబాల సంబరాలు

**జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మన్మధరావు**

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ' గోబాల సంబరం' కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని ఎమ్మార్ నగరం గ్రామంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మన్మధరావు తెలిపారు. ఎం.ఆర్. నగరం పశువైద్య శాల ప్రాంగణంలో ఉదయం 9:00 గంటలకు ఈ వేడుక ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి గౌరవ జిల్లా కలెక్టరు డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించనున్నారు. మేలు జాతి లేగ దూడలు, పొట్టేళ్ల ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు. నిష్ణాతులైన పశువైద్యులచే పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు మరియు అవసరమైన శస్త్ర చికిత్సలు నిర్వహించబడతాయి. చికిత్స పొందిన పశువులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేయడం జరుగుతుంది. పాఠశాల విద్యార్థులకు పశువుల పట్ల, వాటి సంరక్షణ పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు ఉంటాయి. ప్రదర్శనలో పాల్గొన్న దూడలలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తారు. రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తూనికల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

**ఆకస్మిక తనిఖీలలో 19 కేసులు నమోదు**
**ఎలక్ట్రానిక్ కాటాల్లో భారీగా తేడాలు గుర్తింపు**
**అసిస్టెంట్ కంట్రోలర్ పి.వి రంగారెడ్డి**

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురంలోని ప్రధాన వ్యాపార కేంద్రాల్లో లీగల్ మెట్రాలజీ (తూనికలు మరియు కొలతల శాఖ) అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్ పి.వి రంగారెడ్డి నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి. పార్వతీపురం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద ఉన్న చేపల మార్కెట్, పెద్ద బజార్‌లోని చికెన్, మటన్, చేపల దుకాణాలు, కిరాణా షాపుల్లో అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈతనిఖీల్లో వెలుగులోకి వచ్చిన ఉల్లంఘనలు. ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారమ్ కాటాలపై మోసానికి సంబంధించి 8 కేసులు నమోదు చేయడం జరిగింది. నిర్ణీత కాలపరిమితిలో కాటాలకు ప్రభుత్వ ముద్రలు వేయించనందుకు 6 కేసులు నమోదయ్యాయి. అలాగే ప్యాకెట్లపై తయారీదారు పేరు, చిరునామా, ధర, తయారీ తేదీ వంటి వివరాలు లేనందుకు 5 కేసులు నమోదు చేశారు. ఒకే రోజులో వివిధ ఉల్లంఘనలపై మొత్తం 19 కేసులు నమోదయ్యాయి. వినియోగదారులను తూనికలు, కొలతల్లో మోసం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వ్యాపారస్తులు తూనికలు, కొలతలలో తేడాలు లేకుండా సరుకులు విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈతనిఖీల్లో పార్వతీపురం లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ కె.రత్నరాజు, విజయనగరం ఇన్స్‌పెక్టర్ బి. ఉమా సుందరి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్ట్ జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసిన నఖచిత్రకారుడు 'పల్ల'

విశాలాంధ్ర-పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్ట్ జడ్జి జస్టిస్ సియెచ్. మానవేంద్రనాద్ రాయ్ తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంకు దర్శనానికి వచ్చిన సందర్భంగా ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. హైకోర్టు న్యాయమూర్తికు పల్ల పరిశినాయుడు తన రచనపుస్తకాలను అందజేసారు.

## ఏపీ హైకోర్ట్ జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్, పాలకొండ సబ్ కలెక్టర్లు

విశాలాంధ్ర-పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్ట్ జడ్జి జస్టిస్ సియెచ్. మానవేంద్రనాద్ రాయ్ పార్వతీపురం విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్‌లు వారిస్వగృహం నందు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసారు. జిల్లాలో పలు అంశాలపై ఆయనకు వివరించారు.

## మన్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-సీతంపేట : మండలంలో క్రిస్మస్ వేడుకలు క్రిస్టియన్ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. సోమగండి ఆర్.సి.యం చర్చిలో ఫాదర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో దివ్య బలి పూజ అనంతరం కేక్ కటింగ్ చేశారు. పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ క్రిస్మస్ సందర్భంగా క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పాలకొండ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పడాల భూదేవి కోతం గ్రామపంచాయతీ బెన్నడు గూడ గ్రామంలో గ్రామస్తులు ఆహ్వానం మేరకు వెళ్లి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. సీతంపేటలో మూర మోహన్ తన చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## పార్లమెంట్ కార్యదర్శిగా బిడ్డిక జయలక్ష్మి

విశాలాంధ్ర -సీతంపేట: సీతంపేట కేంద్రం మాజీ ఎంపీటీసీ బిడ్డిక. జయలక్ష్మి టీడీపీ పార్టీ అభివృద్ధి కోసం చేసిన పని, కృషి పట్టుదల ను, జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గెలుపునకు చేసిన కృషికి గుర్తించిన టీడీపీ పార్టీ పార్లమెంట్ కార్యదర్శి పదవిని ఆమెకు కట్టబెట్టింది అని సంతోషం వ్యక్తం చేశారు. జయలక్ష్మి మాట్లాడుతూ నాకు పార్టీలో పార్లమెంట్ కార్యదర్శిగా నామినేట్ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి యువ నేత లోకేష్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు అనంతరం తనకు పదవి కొరకు కృషి చేసిన నియోజకవర్గం ఇంచార్జ్ పడాల భూదేవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి నాకు మరింత బాధ్యతని పెంచిందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో మరింత కష్టపడి విజయం కోసంఅందరిని కలుపుకుంటూ పనిచేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ పార్సిల్, కొరియర్ కార్యాలయాన్ని సాలూరు డిపో మేనేజర్ సందర్శన

విశాలాంధ్ర-మక్కువ : మక్కువ మండలంలో సాలూరు డిపో మేనేజర్ ఆచారి 25-12-2025న మక్కువ ఏపీఎస్ఆర్టీసీ పార్సిల్ మరియు కొరియర్ ఆఫీసును సందర్శించారు ఇందులో భాగంగా కళాశీలతో మరియు వినియోగదారులతో సంభాషించారు వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు అలాగే వ్యాపార అభివృద్ధికి తగు సూచనలు అందజేశారు.

## 27న అవయవ దానంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ఈనెల 27వ తేదీన స్థానిక కర్షక మహర్షి ఆసుపత్రి ప్రాంగణంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 63వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పీఎంపీ అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సింహాచలం తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ఈ కార్య క్రమంలో అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు ద్వారపురెడ్డి. రామ్మోహన రావు హాజరవుతారన్నారు. కావున ఈ కార్య క్రమానికి జిల్లాలోని పీ. హెచ్.పి. సభ్యులందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో కార్యదర్శి నడిమింటి గోపాల నాయుడు జిల్లా ఉపాధ్యక్షులు వానపల్లి శంకరరావు, సహాయ కార్యదర్శి బొంతల కోటి. వెంకటరమణ, కోశాధికారి బాసంగి తులసీదాస్ పాల్గొన్నారు.

## తూనికల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

**- ఆకస్మిక తనిఖీలలో 19 కేసులు నమోదు**
**- ఎలక్ట్రానిక్ కాటాల్లో భారీగా తేడాలు గుర్తింపు**
**- అసిస్టెంట్ కంట్రోలర్ పి.వి. రంగారెడ్డి**

విశాలాంధ్ర-సాలూరు : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి వారి ఆదేశాల మేరకు సాలూరు పట్టణం లోని ప్రధాన వ్యాపార కూడళ్లలో లీగల్ మెట్రాలజీ (తూనికలు మరియు కొలతల శాఖ) అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. విజయనగరం మరియు మన్యం జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్ పి.వి. రంగారెడ్డి నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి. ఆర్.టి.సి బస్ కాంప్లెక్స్ వద్ద ఉన్న చేపల మార్కెట్, పెద్ద బజార్‌లోని చికెన్, మటన్, చేపల దుకాణాలు మరియు కిరాణా షాపుల్లో అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన ఉల్లంఘనలు. ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారమ్ కాటాలపై మోసానికి సంబంధించి 8 కేసులు నమోదు చేయడం జరిగింది. నిర్ణీత కాల పరిమితిలో కాటాలకు ప్రభుత్వ ముద్రలు వేయించనందుకు 6 కేసులు నమోదయ్యాయి. అలాగే ప్యాకెట్లపై తయారీదారు పేరు, చిరునామా, ధర, తయారీ తేదీ వంటి వివరాలు లేనందుకు 5 కేసులు నమోదు. ఒకే రోజులో వివిధ ఉల్లంఘనలపై మొత్తం 19 కేసులు నమోదు. వినియోగదారులను తూనికలు, కొలతల్లో మోసం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వ్యాపారస్తులు తూనికలు, కొలతలలో తేడాలు లేకుండా సరుకులు విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పార్వతీపురం లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ కె. రత్నరాజు, విజయనగరం ఇన్స్‌పెక్టర్ బి. ఉమా సుందరి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలందరూ శాంతి మార్గంలో నడవాలి : మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర -సాలూరు : లోకంలో శాంతి, ప్రేమ వాతావరణం ఉండాలంటే ప్రతీ ఒక్కరూ క్రీస్తు చూపిన శాంతి మార్గంలో నడవాలని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో పెద్దవీధిలో ఉన్న ఆర్‌సిఎం చర్చ్ మరియు దిగువ స్టాండ్ లో ఉన్న లూథరన్ చర్చిలలో నిర్వహించిన వేడుకలలో పాల్గొని కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ పెద్దలు ఆమెకు ఆశీర్వాదాలు అందించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ మనందరిని ఒకచోట చేర్చి ప్రార్థనలో పాల్గొనే అవకాశం కలిపించిన దేవుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని అన్నారు.యేసుక్రీస్తు ఈ లోకానికి రాజుగా కాకుండా ఒక సాధారణ శిశువుగా జన్మించారని ఆయన జననం ద్వారా దేవుడు మనకు ఒక గొప్ప సందేశం ఇచ్చారన్నారు.ప్రేమ తో జీవించడం,క్షమతో ముందుకు సాగండి క్రీస్తు బోధనలను అనుసరించి జీవించాలన్నారు.విభేదాలు,విద్వేషాలను వీడి యేసు చూపిన మార్గాన్ని అనుసరించి ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని పిలుపునిచ్చారు.అవసరం ఉన్నవారిని ఆదుకోవడం,బాధలో ఉన్నవారిని ఓదార్చటం నిజమైన క్రిస్టమస్ సందేశమన్నారు.నేటి సమాజానికి క్రీస్తు జీవితం దిక్సూచిలాంటిదన్నారు.క్రిస్టమస్ పండుగ మనందరి హృదయాల్లో, జీవితాలలో కొత్తవెలుగులను నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు పట్టణపార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి,నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : క్రిస్మస్ పండగ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి

మానవీయ విలువలకు ప్రతీక అని ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎల్విన్ పేటలో గురువారం నాడు నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దైవ సేవకులతో కలిసి ఎమ్మెల్యే గారు కేక్ కట్ చేసి విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన క్రిస్మస్ సభలో మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ వాటిని ఆచరించాలని సూచించారు. పరస్పర సహకారం, సహనము, సోదరభావంతో జీవించడమే క్రిస్మస్ పండగ యొక్క ముఖ్య సందేశమని తెలిపారు. ఈ పండుగను క్రైస్తవ సోదరులు కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అడ్డాకుల నరేష్, మండ సర్పంచ్ హైమవతి, ఫాదర్స్, దైవసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గొరడలో వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రం ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-కురుపాం : గుమ్మలక్ష్మీపురం మండలం గొరడ గ్రామంలో గురువారం వావిలాల బాపూజీ స్మారక వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ఈ ఎరువులు మాకొద్దు', "కర్మణ్యేవాధికారస్తే" అనే పుస్తకాలను ఆవిష్కరించడంతో పాటు నాబార్డ్ ఆధ్వర్యంలో రూపొందించిన జీవ పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విజ్ఞానం, సాంకేతికత రైతులకు అందుబాటులోకి రావడం ఎంతో అవసరమని, ఇలాంటి విజ్ఞాన కేంద్రాలు రైతుల అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ సహజ వ్యవసాయం, రసాయన రహిత పంటల సాగుపై రైతుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంకాడ రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, జట్టు వ్యవస్థాపకుడు డి.పారినాయుడు గ్రంథాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పురాణ, ఇతిహాసాలపై అవగాహన తప్పనిసరి

విశాలాంధ్ర-కురుపాం : రామాయణ మహాభారత ఇతిహాసాలు మరియు పురాణాలు అభ్యాసనము చేసుకొనటం వలన మానవుడు సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొనడానికి కావలసిన శక్తిని ఇస్తాయని భగవద్గీత జ్ఞాన మందిర వ్యవస్థాపకులు హెచ్ఎం ఎం హరి నారాయణ అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల కురుపాం వారు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరం సీతంపేటలో హరి నారాయణ మాస్టార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి వైఖరి నైపుణ్యము, విజ్ఞానాన్ని కలిగి ఉండాలని మానవుని మేధస్సు మంచి విషయాలతో నిక్షిప్తం చేయాలి అని వాటిని మననం చేసుకుంటూ సమయస్ఫూర్తి వ్యక్త పరచాలని అన్నారు. సంకల్పము, ప్రవృత్తి, క్రమశిక్షణ ,ఇంగిత జ్ఞానము కలిగి ఉండి వివేకంతో సంఘజీవనానికి అవసరమైన జ్ఞానాన్ని పెంపొందించుకొనవలెనని తెలియజేశారు. కురుపాం గ్రామ ఉపసర్పంచ్ షేక్ ఆదిల్ ప్రత్యేక సేవ శిబిరాన్ని సందర్శించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపల్ ఎం కుమారస్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాలను ప్రతి విద్యార్థి పెంపొందించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని జ్ఞానముతో కూడిన సంఘజీవనానికి ఇది అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ కురుపాం సూపర్వైజర్ వై రామలక్ష్మి, ఐసిడిఎస్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం రమేష్ కుమార్, అధ్యాపకులు ఎస్ బాలరాజు గ్రామ పెద్దలు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## మహిళ ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి

విశాలాంధ్ర- సీతానగరం : మండలంలోని కాసాపేట గ్రామానికి చెందిన తేలు సూర్యనారాయణ భార్య తేలు రేణుక బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి తన ఇంటివద్ద నుంచి కనిపించ కనిపించకుండా ఎటువెళ్లిందో తెలియక పోవడంతో ఆమెభర్త తేలు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై ఎం. రాజేష్ తెలిపారు. ఫోటోలో ఉన్న అమ్మాయి ఆచూకీ లభించినట్లయితే సీతానగరం పోలీస్‌స్టేషన్ నెంబర్ 912111 09457కు గాని, ఆమె భర్త నెంబర్ అయినా 9705767650కు గాని సమాచారం అందించాలని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

## ఏపీఎన్జీజీవో అసోసియేట్ అధ్యక్షునికి అభినందనలు వెల్లువ

విశాలాంధ్ర-సీతానగరం : పార్వతీపురం మన్యం జిల్లా ఏపీ ఎన్జీఓ నూతనఅసోసియేట్

ప్రెసిడెంటుగా గొర్లి సూర్యనారాయణను పెదంకలం, సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంల వైద్యులు,వైద్య సిబ్బంది, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వం తక్షణమే రైతుల వద్ద ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

**- 82 కేజీల ధాన్యం ఒప్పందాన్ని అమలు చేయాలి**
**- మిల్లర్ల దోపిడీని నియంత్రించాలి : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం**

విశాలాంధ్ర-పాలకొండ : జిల్లాలో రైతుల పండిస్తున్న ధాన్యం నాణ్యత ప్రమాణాలు లేవని పేరు చెప్పి రైతుల నుండి ధాన్యాన్ని అడ్డంగా దోచుకుంటున్నారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ మధ్యకాలంలో జరిగిన ఆందోళన పోరాటం సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు పాలకొండ సబ్ కలెక్టర్ వద్ద జిల్లా సమితి నాయకత్వం ధాన్యం రైతుల పడుతున్న బాధలను వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడం జరిగింది. మిల్లర్స్ సిండికేట్ గా మారి 84 కేజీలు ఇస్తే గాని కుదరదు అని చెప్పి నేడు మరింత రెచ్చిపోయి ధాన్యం గుండా అయిపోతున్నాయనే కుంటి షాకులు చెబుతూ 88 కేజీలు అడుగుతున్నారు. మిల్లరు రైతును స్వయంగా రప్పించుకొని బేర సారాలు నడిపి చివరికి వారు అనుకున్న ధాన్యాన్ని రైతుల నుంచి బలవంతంగా తీసుకుంటున్నారు దీనిపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు రైతు సంఘ నాయకులుతో గురువారం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ధాన్యం ఏ మేరకు ముక్క అవుతున్నాయో తెలిపే పరికరాలను రైతు సేవా కేంద్రాలు వద్ద ఉన్నప్పటికీ వాటి ఫలితాలను మిల్లర్లు అంగీకరించడం లేదు.మరి అలాంటప్పుడు దేనికి ఈ పరికరాలు.అలాంటప్పుడు ఆ పరికరాలను తొలగించండి.రైతుల ధాన్యం పూర్తిగా ముక్క అయిపోతున్నాయని మిల్లర్లకు తీవ్రంగా నష్టం జరిగిపోతుందని ఆ లోటును భర్తీ చేయడానికి అదనపు ధాన్యాన్ని ఇస్తేనే లారీలను అన్లోడ్ చేస్తున్నారని ఈ పద్ధతి సమంజసం కాదని బుడితి అప్పలనాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనుకున్న ప్రకారం 82 కేజీల ఒప్పందాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సాంకేతిక సమస్య వల్ల బీజేల ప్రాప్తికి ధాన్యం సేకరణ జరగడంలేదని ప్రభుత్వం అనుమతిస్తేనే ధాన్యం సేకరణ చేయగలమని మిల్లర్లు చెప్పున్నడంతో రైతులలో ఆందోళన పెరుగుతుందని ఇప్పటికే సంక్రాంతి పండుగ దగ్గర పడిన నేపథ్యంలో రైతుల కుటుంబాలు పండగ సంతోషాన్ని పొందగలమో లేదని భయం పట్టుకుందని ఇది ఇలా ఉండగా ట్రక్ సీట్లతో సంబంధం లేకుండా జిల్లాలో మిల్లర్స్ వారి అనుకూలమైన దళారుల నుండి ధాన్యాన్ని మిల్లుల వద్ద స్టాక్ చేసుకుంటున్నారని ఇది రైతులలో మరింత కలవరం పెడుతుందని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గురుబిల్లి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మిల్లర్ల డిపాజిట్లు (బీజేల)ను పెంచడంతోపాటు రైతుల వద్ద ఉన్న ధాన్య సేకరణ వేగవంతం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు,ఈ సమావేశంలో సంఘం ఆఫీస్ బ్యానర్ బొత్స గౌరు నాయుడు,కిమిడి రామ్మూర్తి నాయుడు,గొర్లె వెంకట జగన్నాధరావుసంఘం నాయకులు బి.వి.రమణ,యాందవ సూరిబాబు తదితరులు ఉన్నారు.

## నేడు వాహనాల వేలం

**విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్** : వివిధ ఎక్సైజ్ నేరములలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేసేందుకు అధికారులు నిర్ణయించారని ఈ వాహనాలు వేలం నేడు అనగా శుక్రవారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో నిర్వహించడం జరుగుతుందని సదరు అవకాశమును వేలంపాట దారులు వినియోగించుకోవాలని అసిస్టెంట్ ప్రొడక్షన్ & ఎక్సైజ్ సూపరిండెంట్ ఎ. సంతోష్ తెలిపారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**విశాలాంధ్ర-పాలకొండ** : పాలకొండ పట్టణంతోపాటు మండల పరిధిలో అనేక గ్రామాలలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు ప్రధానంగా పాలకొండ పట్టణ పరిధిలో ఉన్నటువంటి ఆర్ సి ఎం చర్చిలో క్రీస్తు జన్మదిన సందర్భంగా ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు అలాగే ఎన్ కె రాజపురం జంక్షన్ లో ఉన్నటువంటి గుడ్ న్యూస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చర్చి ప్రాంగణాన్ని విద్యుత్ కాంతులతో ప్రత్యేక అలంకరణ చేశారు సారోన్ చర్చిలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు పాలకొండ మండల పరిధిలో గరుగుబిల్లి లుంబురు రాజుపేట తదితర గ్రామాల్లో క్రైస్తవ సోదరులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు మత సామ్రస్యానికి ప్రతీకగా ఆర్సీఎం చర్చిలో పట్టణ ప్రజలు ఏసుప్రభును దర్శనం చేసుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ చర్చిలలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

**పార్వతీపురం:** పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజింగి జోగారావు

ఇంటివద్ద గురువారం క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆయనకు నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలి విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ కేకును కోసి అందరికి పంచిపెట్టారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా తనకు శుభాకాంక్షలు చెప్పడానికి విచ్చేసిన వారందరికీ జోగారావు విందును ఏర్పాటుచేశారు.

**బలిజపేట:** పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజింగి జోగారావు ఇంటివద్ద

గురువారం క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు మండలంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. జోగారావుకు వారంతా శుభాకాంక్షలు చెప్పి,క్రిస్మస్ కేకును కోసి అందరికీ పంచిపెట్టారు.

**పాలకొండ** : పాలకొండ పట్టణ పరిధిలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం స్థానిక శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణక్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సోదరులందరకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం 50.50 కోట్ల రూపాయలను ఆంధ్రప్రదేశ్లో ఉన్నటువంటి పాస్టర్ సోదరులకు విడుదల చేసిందని ఈ మొత్తాన్ని ఎనిమిది వేల నాలుగు వందల పద్దెనిమిది మంది పాస్టర్లకు 12 నెలలకు 60000 చెప్పున్న వారి బ్యాంకు ఖాతాలలో జమపుతుందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ప్రజా అభివృద్ధి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో వెనుకడుగు వేసేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంట సంతోష్ కుమార్ కె అప్పలనాయుడు బొమ్మాలి భానుసుధాకర్ కిమిడి కాసింనాయుడు పాస్టర్లు ఆదాము సారోన్ చర్చి ఫాదర్ ఆర్సిఎం చర్చి ఫాదర్ క్రైస్తవ సోదరులు పట్టణ ప్రజలు కూటమి నాయకులు,

కార్యకర్తలు పాల్గొన్నారు.

**కురుపాం** : కురుపాం రావాడ రోడ్డు కూడలిలో ఉన్న గుడ్ సమారిటన్ లూథరన్ చర్చి, దొనక వీధిలో ఉన్న ఇమ్మానియేలు లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ డి.రాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవ సహోదరి, సహోదరులను ఉద్దేశించి క్రిస్మస్ యొక్క ప్రాముఖ్యతను వివరించిన పాస్టర్ డి. రాజు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, డి.జాన్, డి. రాజారత్నం, కోట సుందర సుదర్శన్, డి. ప్రదీప్, డి.జయ కుమార్, అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

**ఏజెన్సీ ప్రాంతంలో** : ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి పాస్టర్ లు

ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పూజలు లో పాల్గొన్నారు.. ఎమ్మెల్యే తోయక జగధీశ్వరి, మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ,తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ లు క్రైస్తవులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

**పాచిపెంట** : ఏసుక్రీస్తు జన్మదిన వేడుకులను పురస్కరించుకొని మండలంలో గల పలు చర్చిలలో గురువారం ఘనంగా క్రిస్టియన్ సోదరులు క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. బుధవారం అర్ధరాత్రి వరకు చర్చి మందిరాలలో ప్రార్థనలతో గడిపిన క్రీస్తు సోదరులు చర్చలను సుందరంగా అలంకరించారు. చర్చి ప్రాంగణంలో విద్యుత్ దీపాలు మిరుమెట్లు గోల్పాయి. గురువారం తెల్లవారుజాము నుండే క్రీస్తు ఆరాధనతో ప్రార్థనలతో క్రీస్తు పాటలతో సందడి చేశారు మండల కేంద్రమైన పార్టీలో గల ఆర్సిఎం

లూథరన్ , పెంతుకోస్తులు ,చర్చ్ ఆఫ్ క్రైస్ట్ మందిరాలతో పాటు మండల ములో గల పాలు చర్చలలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మండల కేంద్రమైన పాచి పెంట లో డప్పు వాయిద్యాలతో నృత్యాలతో సందడి చేశారు.

**సాలూరు** : ప్రేమ, త్యాగం, సహనం, శాంతి వంటి యేసుప్రభు చూపిన మార్గాన్ని పాలకులు, ప్రజలు అనుసరించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గురువారం వావాదాస్పద ఏఓబి సరిహద్దు కొఠియా గ్రాపులలో ఒకటైన దొర్లతాడిపలస లో బేతేల్ చర్చ్ నిర్వహకులు గుడివాడ సువార్తరావు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్టమస్ వేడుకలలో రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలతో రాజన్నదొరను ఆశీర్వదించారు. నిర్వహకులు ఏర్పాటు చేసిన కేక్ను కట్ చేశారు.

అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. అందరనీ ప్రేమించాలి, శాంతి మార్గంలో నడవాలి, సేవాభావంతో మెలగాలి అన్న క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమన్నారు. క్రీస్తు బోధనలను అందరూ ఆచరిస్తే ఉత్తమ సమాజం సాకారమవుతుందన్నారు. మానవాళి పట్ల ప్రేమ,నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువులను క్షమించేగుణం, అవధులు లేని త్యాగం యేసుప్రభు లోకానికి ఇచ్చిన సందేశాలన్నారు. క్రీస్తు అందించిన జీవిత సందేశం, విలువలను అనుసరించి ప్రతీ ఒక్కరు జీవించాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక మహిళలతో కలిసి సాంప్రదాయ ధింసా నృత్యాన్ని చేశారు.పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్రైస్తవ మత పెద్దలు, స్థానిక గిరిజనులు రాజన్నదొర సు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు, నాయకులు రాజారావు, సాంబ, పరిమళలతో పాటు గ్రామ ప్రజలు, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహణ

**విశాలాంధ్ర-సీతానగరం** : రాష్ట్రీయ స్వయంసేవక్ వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశంలో అన్ని చోట్ల హిందూ సమ్మేళనాలు జరుగుతున్నాయని, దీనిలో భాగముగా మండలంలోని బల్లకృష్ణపురం, గెడ్డలుప్పి కూడలిలోఉన్న కృషి విద్యానికేతన్లో గురువారంనాడు హిందూ సమ్మేళన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. బల్లక్రిష్ణాపురం, బగ్గందొరవలస, గెడ్డలుప్పి, బక్కుపేట, పణుకుపేట, తామరఖండి, చినబోగిలి గ్రామాలకు బల్లక్రిష్ణాపురం జంక్షన్లో కృషి విద్యానికేతన్ స్కూల్లో జరిగిన హిందూ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీ శ్రీనివాసనంద సరస్వతి స్వామి, ఆర్ఎస్ఎస్ నుంచి కొల్లూరు జగన్నాధంలు పాల్గొని మాట్లాడారు. భక్తులతో పాటు మూడుగ్రామాలు గ్రామ పెద్దలు, గోవింద మాలలు ధరించిన భక్తులు పాల్గొన్నారు. గ్రామ పురోహితులు శ్రీ వేణుస్వామి, దేవల సురేష్, మండల బీజేపీ అధ్యక్షుడు బాలూ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోటదుర్గ మోటార్ యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవం

**విశాలాంధ్ర-పాలకొండ** : పాలకొండ పట్టణానికి చెందిన ఓల్డ్ బస్టాండ్ ఆవరణలో ఉన్న శ్రీ కోటదుర్గ ప్రైవేటు వాహనాల యూనియన్ను గురువారం ఏకగ్రీవంగా కార్మికులంతా కలిసి ఎన్నుకున్నారు కోటదుర్గ మోటార్ యూనియన్ అధ్యక్షుడిగా పరిసర్ల సత్యనారాయణ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అలాగే వైస్ ప్రెసిడెంట్ గా పాలకొండ ప్రసాదరావును సెక్రెటరీగా సవర చంటి సహకార్యదర్శిగా కడగల పురుషోత్తం రావు ట్రెజరర్ గా మద్ది చంద్రశేఖర్ అలాగే కమిటీ మెంబర్స్ గా మజ్జి త్రినాథ పైల మోహన్ రావు కూర్మాన రాజు గుమ్మడి జనార్ధన రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఎన్నుకోబడిన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రైవేటు వాహనాల ఆపరేటర్లకు కార్మికులకు శక్తివంచన లేకుండా సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా వెల్లడించారు.

## ముడుపులపూజలకు అనూహ్య స్పందన

**విశాలాంధ్ర-సీతానగరం** : స్థానిక శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో గురువారం జరిగిన ముడుపుల పూజలకు భక్తజనం పెద్దఎత్తున తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేకువ జామునుండే దూరప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయం సందడిగా కనిపించింది. పెద్దఎత్తున ముడుపుల పూజలకు తరలివస్తున్నట్లు

ఆలయ ప్రధానఅర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, టీటీడీ పారాయణకర్త కె.శ్రీనివాసరావులు తెలిపారు. భక్తులుతెచ్చిన వివిధ రకాల పూలదండలు, పూలు, తులసి మాలలతో స్వామివారినీ అలంకరించిన తీరు అందరిని ఆకట్టుకునే విధంగా తయారుచేయడంతో భక్తులు తమ సెల్ ఫోన్లులో ఫోటోలు తీసుకుంటున్నారు.ప్రతీగురువారం ముడుపులు పూజలకు వస్తున్న భక్తులు నిర్మలమైన మనస్సుతో పూజలు చేస్తూ 27సార్లు ఆలయంచుట్టూ మంత్రాల ఉచ్చరిస్తూ ప్రదక్షిణలను పూర్తిచేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరలి వెళ్తున్నారు. ఈపూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త దంపతులు చెలికాని వెంకటగోపాలకృష్ణ భారతిలతోపాటు భక్తజనం పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలోప్రధానఅర్చకులతో పాటు కె.మురారి, పవణ్ కళ్యాణ్ ఆచార్యులు, కృష్ణమోహన్ ఆచార్యులు, విహారి, ప్రసాద్, శ్రీకర్ ఆచార్యులు తదితర అర్చకులు పాల్గొని భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ధనుర్మాసం కావడంతో పెద్దఎత్తున మహిళ భక్తులు తరలిరావడం గమనార్హం. ఆలయ ప్రాంగణం లక్ష్మీనరసింహస్వామి, జై శ్రీమన్నారాయణ, గోవింద నామస్మరణతో మార్మోగుతుంది.

## ఈనెల 30న వైకుంఠ ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధం

**విశాలాంధ-సీతంపేట** : స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నందు ఈనెల 30వ తేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను టీటీడీ దేవస్థానం వారు అంగరంగ వైభవంగా జరుపుటకు సర్వం సిద్ధం చేస్తున్నారు. భక్తులంతా పాల్గొని వెంకటేశ్వర స్వామి దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని దేవస్థానం వారు తెలిపారు.

## ఘనంగా జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

**విశాలాంధ్ర-సీతానగరం** : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీవేణుగోపాలస్వామి, శ్రీరాజ్యలక్ష్మి ఆలయాల్లో ధనుర్మాసపూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. జై శ్రీమన్నారాయణ, గోవింద, గోవిందా, గోదాదేవి అంటూ నామాల స్మరిస్తూ ఆలయంచుట్టూ స్వామివారిని ఘనంగా ఊరేగించారు. దీనిలోబాగంగా గురువారంనాడు అర్చకులు, భక్తులు

కలిసిగోదాదేవి పల్లకీసేవలను ఘనంగా నిర్వహించారు. భక్తులుతెచ్చిన రకరకాల పూలతోపాటు, నూతనవస్త్రాలతో స్వామివారిని అలంకరించిన తీరు అందరినీ ఆకట్టుకునేలా అర్చకులు శ్రీనివాసాచార్యులు చేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగముగా నగర సంకీర్తన, మేలుకొలువు కార్యకార్యక్రమాలుతోపాటు పల్లకీ ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు ఆలయప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజా చార్యులు, టీటీడీ పారాయణకర్త శ్రీనివాసరావులు తెలిపారు. ఈధనుర్మాస ఉత్సవాల్లో ఆలయధర్మకర్త దంపతులు చెలికాని వెంకటగోపాలకృష్ణ భారతిలతోపాటు గోవిందభక్తులు పెద్దఎత్తున పాల్గొంటున్నారు. ఈకార్యక్రమంలో ప్రధాన అర్చకులతో పాటు కిరీటి,విహారి, మురారీ, శ్రీకర్, ప్రసాద్, కృష్ణమోహన్, మనోజ్, పవన్ కల్యాణ్ ఆచార్యులు పాల్గొన్నారు.

## విద్యా సర్వ మంగళ దేవిపీఠాన్ని దర్శించుకున్న ఎమ్మెల్సీ

**విశాలాంధ్ర- పార్వతీపురం రూరల్:** పట్టణంలో గల శ్రీ విద్యా సర్వ మంగళ దేవి పీఠాన్ని ఉమ్మడి విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ గత 18 సంవత్సరములుగా శ్రీవిద్యాసరమంగళ దేవి పీఠంతో ప్రత్యేక అనుబంధం ఉందని, పీఠంలో జరిగే ప్రతి ఒక్క ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొంటున్నామని ఏ సమస్య వచ్చినా ఇక్కడికి వచ్చి అమ్మవారికి మొక్కుకొని పీఠాధిపతులు నాడీ జ్యోతిష్యులు అయిన బ్రహ్మశ్రీ మురపాక కాళిదాసు శర్మ ఆదేశానుసారము అనేక ఆధ్యాత్మిక కార్యక్రమములు చేపడుతున్నామని గతంలో ఎమ్మెల్సీ పదవికి సంబంధించి కొన్ని ఆటంకములు ఎదురైనప్పుడు ఇక్కడ అమ్మవారి అనుగ్రహంతో కోర్టు నుంచి సానుకూలమైన తీర్పు లభించిందని, అలాగే గత 190 రోజుల నుంచి జిందాల్ భూముల వ్యవహారంలో రైతులు క్షేమం కోరి చేపట్టిన దీక్ష కార్యక్రమం కు సంబంధించి కూడా సర్వమంగళ దేవి అనుగ్రహంతో రైతులకు న్యాయం జరిగేలాగా రెండు రోజుల క్రితమే కోర్టు తీర్పు ఇచ్చిందని అందుకే అమ్మవారికి మరలా ప్రత్యేకంగా మొక్కు తీర్చుకోడానికి వచ్చామని అన్నారు.

## స్వామివారిని సత్కరించిన నిర్వాహకులు

**విశాలాంధ్ర-సీతానగరం** : మండలంలోని బగ్గం దొరవలస, బల్లకృష్ణాపురం, గెడ్డలుప్పి కూడలిలో గురువారం జరిగిన హిందూమత సమ్మేళనం సందర్భంగా ముఖ్యఅతిథిగాపాల్గొని హిందూమతం, ఆర్ ఎస్ ఎస్ గూర్చి చక్కని సందేశాన్ని ఇచ్చిన ఆనందాశ్రమ పీఠాధిపతి, ఆంధ్ర ప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామిశ్రీనివాసానంద సరస్వతినీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు,భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భరత్ భూషణ్కు ఘన సత్కారం

**విశాలాంధ్ర-పాలకొండ** : ఉత్తరాంధ్ర ఉద్యోగ సంఘాల నాయకుడు ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక కన్వీనర్ అభ్యుదయ కవి రచయిత రాజ్యాంగ నిపుణులు నూతులపాటి భరత్ భూషణ్ రాజుకు గురువారం ఘనంగా సత్కరించారు

ముందుగా క్రీస్తు జన్మదిన సందర్భంగా కేకును కోసి శుభాకాంక్షలు తెలిపారు ఇటీవల కుసుమ ధర్మన్న స్మారక సాహితీ అవార్డుకు ఎంపిక కావడం అమరావతిలో ఘనంగా సత్కరింపబడ్డారు, 13వ వార్డు కౌన్సిలర్ భాసూరు కాంతారావు ఆధ్వర్యంలో భరత్ భూషణ్ రాజు పాలకొండ వచ్చిన సందర్భంగా వార్డు పెద్దలు ఘనంగా సత్కరించారు మరెన్నో అత్యున్నతమైనటువంటి పదవులు అధిరోహించాలని బడుగు బలహీన వర్గాల వారికి అండగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పాలవలస రమేష్ మాస్టారు విశ్రాంతి వీఆర్వో పాలవలస రమేషు తుంబలి వాసుదేవరావు కొండపల్లి రాంబాబు పెద్ది జగదీష్,ఖండాపు వెంకటరమణ సీనియర్ జర్నలిస్టులు యామాల ఈశ్వరరావు సాక్షి కళ్యాణ్ గవరయ్య భాసూరు శ్రీకాంత్ బి ప్రవీణ్ తదితరులు ఉన్నారు ఈ సందర్భంగా భరత్ భూషణ్ రాజు మాట్లాడుతూ మరింత బాధ్యత పెరిగిందని ఉద్యోగులకు మరింత సేవలు అందించి వారి హక్కుల కోసం పనిచేస్తానని సత్కరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఘంటసాల మాస్టారు జయంతి వేడుకలు

**విశాలాంధ్ర-పాలకొండ** : పట్టణములో శ్రీ కోట దుర్గ ఆలయ ప్రాంగణంలో ఉన్న కళ్యాణ మండపంలో గురువారం స్వర్గీయ మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 104వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన ఆలయ ప్రధాన అర్చకులు ధార్లపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ చేశారు ఈ వేడుకలు విశ్రాంతి వసతి గృహ అధికారి కోవగాన సూరన్నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు పాటల పోటీలలో విజేతలగా నిలిచిన వారికి నగదు ప్రోత్సకాలను అందించారు అనంతరము ఈ జయంతి వేడుకలలో న్యాయ నిర్ణీతలైన రమణమూర్తి కె ఎస్ ఎన్ మూర్తిలకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కనపాక చౌదరి నాయుడు వావిలపల్లి గోవిందరావు కండాపు గోవిందరావు అనంత రఘురాం సూర్యం మాస్టారు బహుమతులు అందుకున్న వారు సూర్యప్రకాశరావు సుబ్రహ్మణ్యం సోనాలిక. బి శంకర్రావు మాస్టారు యోగ మాస్టర్ జనార్ధన్ రావు భాస్కర నాయుడు వీరితోపాటు పట్టణానికి చెందిన పెద్దలు సంగీత ప్రియులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు

**సబ్ ఇన్స్పెక్టర్ వై.అమ్మనరావు**

**విశాలాంధ్ర-సీతంపేట** : మండలం మెట్టుగూడ గ్రామం సెంటర్లో సబ్ ఇన్స్పెక్టర్ తన పోలీసు బృందంతో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని ప్రమాదాలకు గురికా వద్దని వాహన సోధకులకు అవగాహన కల్పించారు. మైనస్ ఎవరికీ వాహనాలు డ్రైవింగ్ ఇవ్వవద్దని యాక్సిడెంట్లకు గురి కావద్దని అన్నారు. మన్యం ప్రాంతంలో గంజాయి వాడకం జరిపిన తరలింపు చేసిన క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. సైబర్ నేరగాల వలలో పడవద్దని జాగ్రత్తలు పాటించాలని, మహిళలు వారి ఫోన్లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని సద్వినియోపరుచుకోవాలని తెలిపారు.